అవినీతి సూచీలో భారత్‌కు 93వ ర్యాంకు

గత ఏడాది కంటే 8 స్థానాలు దిగువకు

న్యూఢిల్లీ, జనవరి 30: గ్లోబల్ కరప్షన్ ఇండెక్స్‌లో భారత్ 93వ స్థానంలో నిలిచింది. గత ఏడాది 85వ ర్యాంకులో నిలిచిన భారత్.. ఈ సారి మరింత దిగజారింది. ప్రపంచ వ్యాప్తంగా 180 దేశాలలో 2023 ఏడాదికి సంబంధించి ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ఈ ర్యాంకులను విడుదల చేసింది. ప్రభుత్వ రంగంలోని అవినీతిపై నిపుణులు, వ్యాపార వేత్తలు తదితరుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా 0 నుంచి 100 స్కేల్ ద్వారా ఈ సూచీని తయారు చేశారు. ఇందులో సున్నాను అత్యంత అవినీతిగా, 100ను స్వచ్ఛమైనదిగా లెక్కకడుతూ స్కోర్ ఇచ్చారు. 2023లో భారత్ స్కోర్ 39 కాగా, 2022లో ఈ స్కోర్ 40గా ఉన్నది.

అవినీతి సూచీలో ర్యాంకులు

డెన్మార్క్	1
ఫిన్లాండ్	2
న్యూజిలాండ్	3
చైనా	76
ఇండియా	93
పాకిస్థాన్	133
శ్రీలంక	115
బంగ్లాదేశ్	149

మారువేషంలో వెళ్లి మట్టుబెట్టారు

జెనిన్: సాధారణ మహిళలు, వైద్య సిబ్బందిలాగా ఓ దవాఖానలోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ సైన్యం ముగ్గురు పాలస్తీనియన్ ఉగ్రవాదులను మట్టుబెట్టింది. వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ పట్టణం ఐబీఎన్ సినా దవాఖానలో మంగళవారం ఈ ఘటన జరిగిందని పాలస్తీనా ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఈ ఘటనలో ఎదురు కాల్పులు జరగలేదని దవాఖాన ప్రతినిధి తెలిపారు. దాడిని ఖండించిన ఆరోగ్య శాఖ అంతర్జాతీయ సమాజం ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెచ్చి దవాఖానల్లో ఇలాంటి ఆపరేషన్లు చేపట్టకుండా చూడాలని కోరింది. ఉగ్రవాదులు దవాఖానను రక్షణ స్థావరంగా వాడుకున్నారని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఉగ్రవాదుల్లో ఒకరు ఒక దాడి కోసం ఆయుధాలను సరఫరా చేశారని వెల్లడించింది. దవాఖాలపై ఇజ్రాయెల్ సైన్యం చేస్తున్న దాడులు ప్రపంచ వ్యాప్తంగా విమర్శలను ఎదుర్కొంటున్నాయి. మరోవైపు కాల్పుల విరమణ చర్చల్లో కొంత పురోగతి కనిపించినా సంపూర్ణ విజయం దక్కే వరకు యుద్ధాన్ని ఆపబోమని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పునరుద్ఘాటించారు.

ఇల్లు కొంటే.. భార్య ఫ్రీ!

చైనాలో ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ వింత ప్రచారం

- ఇల్లు కొంటే ప్రేయసికి బంగారమంటూ మరో కంపెనీ
- నిర్మాణం పూర్తయిన ఇండ్లను విక్రయించడానికే ఆఫర్లు
- చైనాలో రియల్ ఎస్టేట్ ఢమాల్.. 72 లక్షల ఇండ్లు ఖాళీగానే
- ఘోస్ట్ సిటీలుగా దర్శనమిస్తున్న నగర శివారు ప్రాంతాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): చైనాలో రియల్ ఎస్టేట్ సంక్షోభం తారాస్థాయికి చేరుకొన్నది. ఎంతలా అంటే 'ఇల్లు కొనండి.. భార్యను ఉచితంగా పొందండి' అంటూ నిర్మాణ సంస్థలు ప్రకటనలు ఇచ్చి కస్టమర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి మరి. టియాంజన్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ ఈ తరహా వింత ప్రచారం ప్రారంభించింది. చైనాలో గతంలో బాగా ప్రాచుర్యం పొందిన 'ఇల్లు కొని.. మీ భార్యకు కానుకగా ఇవ్వండి' వాక్యాలను మార్చిన సదరు కంపెనీ 'ఇల్లు కొనండి.. వైఫ్‌ను ఫ్రీగా పొందండి' అంటూ హోరెత్తించింది. చైనాలో ఇండ్లకు గిరాకీ లేకపోవడంతో పాటు అక్కడి యువకులు వివాహాలు, సంతానం పట్ల అనాసక్తితో ఉన్నారు. దీంతో ఈ కంపెనీ ఇలాంటి వింత ప్రచారానికి తెరతీసింది. ఈ విషయం గత సెప్టెంబర్‌లో ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో సదరు కంపెనీకి తాజాగా 4,184 డాలర్ల జరిమానా విధించింది. నిర్మాణం జరిగిన తమ ఇండ్లను విక్రయించడానికి తూర్పు జిజియాంగ్ ప్రావిన్స్‌కు చెందిన మరో కంపెనీ ఇల్లు కొనే వ్యక్తి ప్రేయసి లేదా ప్రియుడికి పది గ్రాముల బంగారు గొలుసును బహుమతిగా ఇస్తామంటూ మరో ఆఫర్‌ను ప్రకటించింది.

ఎందుకీ రియల్ ఎస్టేట్ సంక్షోభం?

చైనా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉండే స్థిరాస్థి రంగం ఇప్పుడు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. 2021లో స్థిరాస్థి రంగ దిగ్గజం ఎవర్‌గ్రాండె సంక్షోభంలో పడిన నాటి నుంచి ఈ రంగం తీవ్ర ఒడిదొడుకులను చవిచూస్తున్నట్టు స్థిరాస్థి రంగ నిపుణులు చెబుతున్నారు. ఎవర్‌గ్రాండె తర్వాత కంట్రీ గార్డెన్ హోల్డింగ్స్ వంటి సంస్థలు కూడా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడం, నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం భయాలు, ఆర్థిక స్థిరత్వం లేకపోవడంతో యువత పెండ్లిళ్లకు విముఖత చూపిస్తుండటం, బ్యాంకుల నుంచి గృహరుణాలు తీసుకోవడంలో అనాసక్తి వెరసి గత ఆగస్టు చివరి నాటికి దేశవ్యాప్తంగా 900 చదరపు అడుగులు ఆపై విస్తీర్ణం కలిగిన దాదాపు 72 లక్షల కొత్త ఇండ్లు విక్రయాలు జరుగకుండా ఉన్నట్టు నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ గణాంకాల్లో తేలింది. కిందటేడాది గృహ విక్రయాలు 6 శాతం మేర పడిపోయాయని.. బీజింగ్, షాంఘై, గౌంగ్‌ఝూ, షెంజెన్ తదితర ప్రధాన నగరాల్లో ఒక్క డిసెంబర్ నెలలోనే ఇండ్ల అమ్మకాలు 11 శాతం నుంచి 14 శాతం మేర పడిపోయినట్టు వెల్లడించింది.

చివరకు ఘోస్ట్ సిటీలుగా..

చైనాలో పారిశ్రామిక విప్లవం నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పెద్దయెత్తున నగరాలు, పట్టణాలకు వలస రావడం ప్రారంభించారు. దీంతో వారికి అవసరమైన ఆవాసాలను ఏర్పాటు చేయడానికి రియల్ ఎస్టేట్ కంపెనీలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. నగర శివారు ప్రాంతాల్లో పెద్దయెత్తున ఇండ్ల నిర్మాణాలు చేపట్టాయి. ఇలా జీడీపీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిపి రియల్ ఎస్టేట్ వాటా 29 శాతం వరకూ ఎగబాకింది. ఈ సమయంలోనే దేశంలోని చాలామంది సంపన్నులు, వారికి చెందిన కంపెనీలు.. ఇండ్లు, ఆకాశహర్మ్యాలను కొనుగోలు చేశాయి. అయితే, గృహ కొనుగోళ్లపై వినియోగదారులు ఆసక్తి కనబర్చకపోవడంతో అటు రియల్ ఎస్టేట్ సంస్థలు, ఇటు సంపన్నుల కంపెనీలు కొనుగోలు చేసిన ఇండ్లన్నీ ఖాళీగా ఉండిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అలా కంగ్బాషి, తియాంజెన్లో బిన్హయి న్యూ ఏరియా, జాంగ్జూలోని జెంగ్గాంగ్ న్యూ డిస్ట్రిక్ట్, ఇన్నర్ మంగోలియాలోని క్వింగ్స్ హుయి, యునాన్ ప్రావిన్స్‌లోని పలు పట్టణాల శివారు ప్రాంతాల్లో నిర్మించిన గేటెడ్ కమ్యూనిటీల్లోని ఇండ్లు అమ్మకాలు జరుగక 'ఘోస్ట్ సిటీ'లుగా మిగిలిపోయాయి.

ఇకపై రెండే దరఖాస్తులు!

- ప్రభుత్వ కాలేజీలకు ఒకటి.. ప్రైవేటు కాలేజీలకు మరొకటి
- దేశ్యాప్తంగా అన్ని ఎంబీబీఎస్ సీట్లకు ఒకేసారి కౌన్సెలింగ్
- ఎన్ఎంసీ కీలక నిర్ణయం.. 2024-25 నుంచి అమలు!

న్యూఢిల్లీ: జాతీయ స్థాయి వైద్య విద్య కౌన్సెలింగ్, అడ్మిషన్ల ప్రక్రియలో ప్రస్తుతం ఉన్న సంక్లిష్టతను సరళతరం చేసేందుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) సిద్ధమైంది. ఇందులో భాగంగా ఎయిమ్స్ వంటి జాతీయ స్థాయి మెడికల్ కాలేజీలతోపాటు రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం విద్యార్థులు పదుల సంఖ్యలో దరఖాస్తులు చేసుకోవాల్సిన అవసరం లేకుండా.. కేవలం రెండు దరఖాస్తుల ద్వారా మెడికల్ సీట్లకు పోటీపడేలా కీలక నిర్ణయం తీసుకొన్నట్టు తెలుస్తున్నది. ఇందులో ప్రభుత్వ కాలేజీల కోసం ఒకటి.. ప్రైవేటు కాలేజీల్లో సీటు కోసం మరో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని ఎన్ఎంసీ వర్గాలు పేర్కొన్నాయి. 2024-25 వైద్య విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న ఈ కొత్త విధానంపై త్వరలో మార్గదర్శకాలు వెలువడనున్నాయని తెలిపాయి. రెండు దరఖాస్తులు చేయడం ద్వారా.. విద్యార్థి ఎక్కడ సీటు వస్తే అక్కడ చేరవచ్చని, ఒక వేళ విద్యార్థి కోరుకొన్న చోట సీటు రాకుంటే తదుపరి కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపాయి.

పాత విధానానికి ముగింపు..

మరోవైపు వచ్చే విద్యా సంవత్సరం నుంచి దేశవ్యాప్తంగా అన్ని కాలేజీల్లోని ఎంబీబీఎస్ సీట్లకు ఒకేసారి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ఉన్న నిబంధనల మేరకు జాతీయ స్థాయి మెడికల్ కాలేజీలు, డీమ్డ్ వర్సిటీలు, వివిధ రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలకు విద్యార్థులకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రాల్లోని కాలేజీల్లో 15 శాతం సీట్లను జాతీయ స్థాయి ఓపెన్ కోటాకు రిజర్వ్ చేస్తారు. ఏ రాష్ట్రం విద్యార్థులైనా దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు ఉన్న ఈ సీట్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ జరిగేది. ఆ తర్వాతనే రాష్ట్రాల్లోని మిగతా కన్వీనర్ కోటా సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించే వారు. ఈ ఏడాది నుంచి పాత విధానానికి ముగింపు పలికి, జాతీయ, రాష్ట్ర స్థాయి సీట్లన్నింటికీ ఒకేసారి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా 681 మెడికల్ కాలేజీల్లో 1.04 లక్షల ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎంఎస్, ఎండీ, డీఎన్‌బీ వంటి పీజీ కోర్సులకు 67,802 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

అధ్యాపకులకు 75 % హాజరు తప్పనిసరి

న్యూఢిల్లీ: మెడికల్ కాలేజీల్లో పని చేసే అధ్యాపకులు కాలేజీ జరిగే సమయంలో ప్రైవేటు క్లినిక్‌లు, దవాఖానల్లో ఉండటంపై నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నిషేధం విధించింది. మెడికల్ కళాశాలల్లో అధ్యాపకులకు 75 శాతం హాజరు తప్పనిసరి చేస్తూ 'పీజీ కోర్సులకు కనీస ప్రమాణాల అవసరాలు (పీజీఎంఎస్ఆర్)-2023' పేరుతో తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ద్వారా మెడికల్ కాలేజీల్లో 'ఘోస్ట్ ఫ్యాకల్టీ' సమస్యకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. కాలేజీ కార్యకలాపాలు జరిగే సమయంలో అధ్యాపకులు పూర్తి సమయం అక్కడే ఉండాలని, ఎలాంటి ప్రైవేటు ప్రాక్టీస్ చేయకూడదని మార్గదర్శకాల్లో ఎన్ఎంసీ స్పష్టం చేసింది.

రామ్‌దేవ్ డబుల్ యాక్షన్!

మేడమ్ టుసాడ్స్ మ్యూజియంలో ఏర్పాటు చేయనున్న ప్రముఖ యోగా గురువు రామ్‌దేవ్ మైనపు విగ్రహాన్ని మంగళవారం ఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తన బొమ్మ పక్కన యోగాసనం వేసి రామ్‌దేవ్ ఇలా ఫొటోకు పోజిచ్చారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోల మెరుపుదాడి

- ముగ్గురు జవాన్లు మృతి
- 15 మందికి గాయాలు

కొత్తగూడెం క్రైం, జనవరి 30: తుపాకుల మోతలతో ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం దద్దరిల్లిపోయింది. మావోయిస్టులు మెరుపు దాడికి దిగడంతో ముగ్గురు జవాన్లు నేలకొరిగారు. మరో 15 మంది గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా-బీజాపూర్ జిల్లాల సరిహద్దు టేకులగూడ వద్ద సీఆర్‌పీఎఫ్, పోలీస్ ఉన్నతాధికారులు మంగళవారం నూతన సీఆర్‌పీఎఫ్ క్యాంపును ప్రారంభించారు. తర్వాత సైనికులు అక్కడి నుంచి పెట్రోలింగ్‌కి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన వంద మందికి పైగా సాయుధ మావోలు టేకులగూడ శిబిరంపై మెరుపు దాడికి దిగారు. జవాన్లు ఎదురు కాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో కోబ్రా 201 బెటాలియన్‌కు చెందిన జవాన్లు దేవాన్ సీ, పవన్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ 150 బెటాలియన్‌కు చెందిన లంబాధర్ సిన్హా అక్కడికక్కడే మృతిచెందారు. మరో 15 మంది జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హెలికాప్టర్ ద్వారా రాయ్‌పూర్‌కు తరలించినట్టు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం తెలిపారు. 2021లో ఇదే ప్రాంతంలో మావోయిస్టులు జరిపిన మెరుపు దాడిలో 23 మంది జవాన్లు వీరమరణం పొందారన్నారు.

ఇమ్రాన్‌కు పదేండ్ల జైలు

- అధికార రహస్యాలు వెల్లడించిన కేసులో కోర్టు తీర్పు
- ఎన్నికల వేళ పీటీఐకి శరాఘాతం

ఇస్లామాబాద్, జనవరి 30: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు ప్రత్యేక కోర్టు మంగళవారం పదేండ్ల జైలు శిక్ష విధించింది. దేశ రహస్యాలను బహిర్గతం చేశారన్న కేసులో ఆయనతో పాటు మాజీ విదేశాంగ మంత్రి షా మహ్మద్ ఖురేషీకి కూడా ఇదే శిక్ష విధించింది. ఫిబ్రవరి 8న సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ తీర్పు రావడం పాకిస్థాన్-ఈ-ఇన్సాఫ్(పీటీఐ) పార్టీకి శరాఘాతంగా పరిణమించింది. రావల్పిండిలోని అడియాల జైలులోని ప్రత్యేక కోర్టులో జడ్జీ అబుల్ హస్నత్ ఇచ్చిన తీర్పు కారణంగా ఇమ్రాన్, ఖురేషీ అయిదేండ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయారు.

చిత్రం

సెప్టెంబర్‌లో వస్తున్నాడు

పవన్‌కల్యాణ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకుడు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. కొద్ది మాసాల క్రితం విడుదల చేసిన ఫస్ట్‌గ్లింప్స్ సినిమాపై మరింతగా అంచనాలను పెంచింది. దాంతో సినిమా విడుదల ఎప్పుడోనని అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ముంబయి మాఫియా నేపథ్యంలో సాగే ఈ కథలో పవన్‌కల్యాణ్ స్టైలిష్ డాన్‌గా కనిపించనున్నారు. సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో తెరకెక్కిస్తున్నారు. ఇమ్రాన్‌హష్మీ, అర్జున్‌దాస్, శ్రియా రెడ్డి, ప్రకాష్‌రాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రవి కె చంద్రన్, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, సంగీతం: తమన్, రచన-దర్శకత్వం: సుజీత్.

ఆ రోజే..సరిపోదా శనివారం

నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకుడు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. వినూత్నమైన కాన్సెప్ట్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రంలో నాని పాత్ర సరికొత్త పంథాలో ఉంటుందని చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌లో ఆయన ఇంటెన్స్ రోల్‌లో కనిపించారు. ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 15న విడుదల చేయబోతున్నట్లు నిర్మాతలు తెలిపారు. ప్రియాంక అరుళ్ మోహన్, ఎస్.జె.సూర్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మురళీ.జి, సంగీతం: జేక్స్ బిజోయ్.

వారం ఆలస్యంగా..

సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. వీఐ ఆనంద్ దర్శకత్వంలో ఫాంటసీ అడ్వెంచర్ మూవీగా తెరకెక్కించారు. రాజేష్ దండా నిర్మాత. తొలుత ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయం మేరకు ఫిబ్రవరి 16న రిలీజ్ చేయబోతున్నారు. ఈ విషయాన్ని మంగళవారం మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. సూపర్ నేచురల్ అంశాలతో సాగే ఫాంటసీ చిత్రమిదని, కాల్పనిక ప్రపంచం భైరవకోనలో జరిగే సంఘటనలు ఆద్యంతం ఉత్కంఠను, ఉద్వేగాన్ని పంచుతాయని చిత్రబృందం తెలిపింది. గ్రాఫిక్స్‌కు కథలో కీలకంగా ఉంటాయని పేర్కొంది. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట, సంగీతం: శేఖర్‌చంద్ర, సమర్పణ: అనిల్ సుంకర, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వీఐ ఆనంద్.

ఆ మాటవింటే భయమేస్తుంది

లఘు చిత్రాలతో కెరీర్‌ను మొదలుపెట్టి 'కలర్ ఫొటో' 'రైటర్ పద్మభూషణ్' సినిమాలతో హీరోగా గుర్తింపును సంపాదించుకున్నాడు సుహాస్. ఆయన తాజా చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం పాత్రికేయులతో సుహాస్ పంచుకున్న విశేషాలు..

- గత ఏడాది ఫిబ్రవరిలో 'రైటర్ పద్మభూషణ్'తో మంచి విజయం దక్కింది. అదే సెంటిమెంట్‌ను రిపీట్ చేస్తూ 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' చిత్రం సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది. జనవరి 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట రోజే నాకు బాబు పుట్టాడు. అదొక శుభసంకేతంలా అనిపించింది. ఇవన్నీ చూస్తుంటే అంతా మంచే జరుగుతుందనిపిస్తుంది.
- ఈ సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాను. బ్యాండ్ కొట్టడం నేర్చుకోవడంతో పాటు సన్నివేశాల డిమాండ్ మేరకు గుండు కొట్టించుకొని కనిపించా. దర్శకుడు దుశ్యంత్ రాసిన కథ నన్ను కదిలించింది. అందుకే సినిమా కోసం మనసు పెట్టి పనిచేశా.
- 2007లో ఈ కథ నడుస్తుంది. దర్శకుడు తన నిజజీవితంలో చూసిన సంఘటనల స్ఫూర్తితో కథ రాసుకున్నాడు. ఇంటర్వెల్‌కు ఇరవై నిమిషాల ముందు వరకు చక్కటి కామెడీతో అలరించే కథ..ఆ తర్వాత మలుపులు తీసుకొని ఎమోషనల్‌గా సాగుతుంది. నా పాత్రలో కూడా ఇప్పటివరకూ చూడని హై ఎమోషన్స్ కనిపిస్తాయి.
- ఈ సినిమాలో కులాల ప్రస్తావన ఉంటుంది కానీ..కథా నేపథ్యం మాత్రం అది కాదు. మనుషుల మధ్య అహం ఎలాంటి అడ్డుగోడలు సృష్టిస్తుందన్నదే మెయిన్ పాయింట్. మన జీవితాల్లో జరిగిన చాలా సంఘటనలు తెరపై చూసిన అనుభూతి కలుగుతుంది. 'నీ భుజాల మీదే సినిమాను మోస్తున్నావ్' అని చాలా మంది అంటుంటారు. ఆ మాట వింటే భయమేస్తుంటుంది. నాకు హీరోగా కంటే మంచి నటుడిగా పేరు తెచ్చుకోవడమే ఇష్టం. ప్రస్తుతం ప్రసన్న వదనం, కేబుల్ రెడ్డి చిత్రాలతో పాటు దిల్‌రాజుగారి బ్యానర్‌లో ఓ చక్కటి వినోదాత్మక చిత్రంలో నటిస్తున్నా.

అపూర్వ రావు

ఏ ఉద్యోగం నచ్చలేదు

'హ్యాపీ ఎండింగ్' చిత్రం ద్వారా కథానాయికగా పరిచయమవుతున్నది అపూర్వ రావు. యష్‌పూరి హీరోగా కౌశిక్ భీమిడి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదలకానుంది. ఈ సందర్భంగా అపూర్వ రావు మాట్లాడుతూ 'మా స్వస్థలం ఒంగోలు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత కొన్ని కార్పొరేట్ కంపెనీస్‌లో జాబ్స్ చేశాను. కానీ ఏ ఉద్యోగం నచ్చలేదు. నా మిత్రుల ద్వారా 'హ్యాపీ ఎండింగ్' సినిమా ఆడిషన్స్ ఇచ్చే అవకాశం దక్కింది. ఈ సినిమాలో నేను యోగా టీచర్ పాత్రలో కనిపిస్తా. ఈ సినిమాలో హీరోకు ఓ శాపం ఉంటుంది. ఆయన ఎవరి గురించి ఆలోచిస్తాడో వాళ్లకు సమస్యలొస్తుంటాయి. అలాంటి అబ్బాయిని అర్థం చేసుకొని అండగా నిలిచే పాత్ర నాది. నా పాత్రకు సొంతంగా డబ్బింగ్ చెప్పాను. హీరోకు ఉండే శాపం వల్ల అనేక సమస్యలు ఎదురవుతుంటాయి. ఈ క్రమంలో పండే కామెడీ కడుపుబ్బా నవ్విస్తుంది. నటనలో నేను సాయిపల్లవిని స్ఫూర్తిగా తీసుకుంటా' అని చెప్పింది.

సోహైల్, మేఘలేఖ

నవ్వులు పంచే బాలరాజు

సోహైల్ హీరోగా శ్రీ కోనేటి దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. ఎం.డి.పాషా నిర్మాత. ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం ముఖ్యఅతిథిగా ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బ్రహ్మానందం..కష్టపడితే తప్పకుండా ఫలితం ఉంటుందని, సోహైల్ నటనలో చక్కటి పరిణితి కనబరుస్తున్నాడని ప్రశంసించారు. సినిమా కథ చాలా కొత్తగా ఉందని మంచు మనోజ్ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'వినోదంతో పాటు హృదయాన్ని కదిలించే భావోద్వేగాలున్న చిత్రమిది. సోహైల్ ఈ కథను తన భుజాలపై మోశాడు. భీమ్స్ సంగీతం ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అన్నారు. యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకునే అన్ని అంశాలుంటాయని నిర్మాత ఎం.డి.పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

రియల్‌టైమ్ సైకలాజికల్ గేమ్

గీతానంద్, నేహా సోలంకి జంటగా నటిస్తున్న చిత్రం 'గేమ్ ఆన్'. దయానంద్ దర్శకత్వంలో కస్తూరి రవి నిర్మించారు. ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. మంచి కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశారని అతిథిగా విచ్చేసిన నిర్మాత వివేక్ కూచిభొట్ల అన్నారు. ఇప్పటివరకు తెలుగులో ఇలాంటి కాన్సెప్ట్ రాలేదని, రియల్ టైంలో సాగే సైకలాజికల్ గేమ్‌గా థ్రిల్‌ను పంచుతుందని హీరో గీతానంద్ తెలిపారు. సినిమాలో ప్రతీ సన్నివేశం కొత్తగా ఉంటుందని, విజువల్‌గా, సంగీతపరంగా మరో స్థాయిలో తీర్చిదిద్దామని దర్శకుడు దయానంద్ పేర్కొన్నారు. ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తీశామని, ప్రేక్షకులకు ఫ్రెష్ ఫీల్‌నిస్తుందని నిర్మాత కస్తూరి రవి అన్నారు.

సందేశంతో 'మెకానిక్'

మణిసాయితేజ, రేఖ నిరోషా జంటగా నటించిన చిత్రం 'మెకానిక్'. ముని సహేకర దర్శకుడు. ఏం. నాగ మునెయ్య నిర్మాత. ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. సోమవారం ప్రిరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినిమాట్రోగఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమా పాటలకు మంచి ఆదరణ లభించింది. ఓ సామాజిక సమస్యను ఇతివృత్తంగా తీసుకొని తెరకెక్కించాం. సినిమాలోని సందేశం అందరిని ఆకట్టుకుంటుంది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఎస్.పి.శివరాం, సంగీతం: వినోద్ యాజమాన్య, దర్శకత్వం: ముని సహేకర.

అర్భాజ్‌ఖాన్ తెలుగులో రీఎంట్రీ

బాలీవుడ్ హీరో అర్భాజ్‌ఖాన్ తెలుగులో రీఎంట్రీ ఇవ్వబోతున్నారు. హిందీ చిత్రసీమలో తనదైన గుర్తింపును సొంతం చేసుకున్న ఆయన 'జై చిరంజీవ' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమయ్యాడు. సుదీర్ఘ విరామం తర్వాత ఆయన తెలుగులో పునరాగమనం చేస్తున్నారు. అశ్విన్‌బాబు కథానాయకుడిగా గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నది. అప్సర్ దర్శకుడు. మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మాత. ఈ సినిమాలో అర్భాజ్‌ఖాన్ కీలక పాత్రలో నటించబోతున్నారు. నిర్మాత మాట్లాడుతూ 'అర్భాజ్‌ఖాన్ పాత్ర కథా గమనంలో కీలకంగా ఉంటుంది. మంగళవారం మొదలుపెట్టిన కొత్త షెడ్యూల్‌లో ఆయన జాయిన్ అయ్యారు' అని అన్నారు.

బాలాజీ గుత్తా, మహేశ్వర్ రెడ్డి, అర్భాజ్ ఖాన్, అప్సర్